క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి

పాలకొల్లు అర్బన్: మండు వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి అన్నారు. పాలకొల్లు బస్టాండ్ ఆవరణలో తూర్పు కాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డా. జె.స్వరూప్, డా.జి.రవి, డా.ఆర్.కల్యాణ్‌రామ్, డా. సీహెచ్ రామచంద్ర రావు, కోటక్ మహీంద్రా బ్యాంక్ మేనేజర్ శ్రీరామ్, తూర్పు కాపు సంఘ నాయకులు లోపింటి చిరంజీవి, కోరాడ శ్రీనివాస్, యడ్ల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన



కోట సత్తెమ్మ అమ్మవారి ఆలయం వద్ద జరిగిన అన్నసమారాధనలో భక్తుల సందడి

యలమంచిలి: ఇలపకుర్రు పంచాయతీ కుమ్మరపాలెంలో వెలసిన కోట సత్తెమ్మ అమ్మవారి ఆలయం వద్ద బుధవారం రాత్రి అఖండ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. 21వ వార్షికోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ అన్న సమారాధనలో సుమారు 1500 మంది భక్తులు ప్రసాదం స్వీకరించారు. ఈ నెల 1న ప్రారంభమైన ఉత్సవాలు పది రోజుల పాటు ఘనంగా జరిగాయి. ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి నిత్య కుంకుమ పూజలు, జాతర, ప్రత్యేక పూల రథంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి కానుకలు, చలిమిడి, పానకాల కావిడిలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అఖండ అన్నసమారాధనతో ఉత్సవాలు ముగిశాయని కమిటీ సభ్యులు తెలిపారు.

టీడీపీ నేత పట్టాభి పై ఫిర్యాదు



కాళ్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సోమేశ్వరరావు

కాళ్ల: మంత్రి కారుమూరి నాగేశ్వరరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేత పట్టాభిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాళ్ల జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు బుధవారం కాళ్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 6న ఒక టీవీ డిబేట్లో మంత్రి కారుమూరి నాగేశ్వరరావును దూషిస్తూ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ప్రభుత్వంపై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని తీవ్రంగా ఖండించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన పట్టాభిపై, టీవీ రిపోర్టర్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. రూరల్ సీఐ గీతారామకృష్ణ, ఎస్సై మూర్తికి ఈ మేరకు ఫిర్యాదు కాపీని అందించారు.

వివాహ వేడుకలో పాల్గొన్న మంత్రి కారుమూరి



మల్లిపూడిలో వివాహ వేడుకలో పాల్గొన్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

పెనుమంట్ర: మండలంలోని మల్లిపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుడిమెట్ల బాలగంగాధర్ రెడ్డి కుమారుడు, ప్రభుత్వ చీఫ్‌విప్ చిర్ల జగ్గిరెడ్డి మేనల్లుడైన శరత్‌రెడ్డి వివాహం ఈ నెల 12న ఒంగోలులో జరగనుంది. ఈ సందర్భంగా బుధవారం మల్లిపూడి గ్రామంలో శరత్‌రెడ్డిని పెండ్లికుమారుడిని చేసి, ఏర్పాటు చేసిన విందు సందర్భంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై తమ ఆశీస్సులు అందజేసారు. ఈ వేడుకలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి లావణ్య, హైదరాబాద్ జగదాంబ హాస్పటల్స్ అధినేతలు డాక్టర్ గుడిమెట్ల సత్తిరెడ్డి, రత్న, డాక్టర్ గుడిమెట్ల రామకృష్ణారెడ్డి, చంద్రవేణి దంపతులు హాజరుకాగా, పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, జెడ్పీటీసీ కర్రి గౌరీసుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు మొదలుపెట్టాలి

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించామని, పలు కారణాలతో ఇంకా కొన్ని గ్రామాల్లో వాటిని చేపట్టలేదని తమ దృష్టికి వచ్చిందని, వాటిని సకాలంలో ప్రారంభించకపోతే నిధులు మురిగిపోకుండా వాటిని రద్దు చేసి వేరే గ్రామాలు, ప్రాంతాలకు కేటాయిస్తానని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం నరసాపురం మండలపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మైలాబత్తుల సోని అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ప్రసాదరాజు అభివృద్ధి పనుల తీరును పీఆర్ ఏఈ నాగేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఇంకా కొన్ని గ్రామాల్లో పనులు చేపట్టకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు–నేడు, గడపగడపకూ, మండలపరిషత్, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి అనేక నిధులు తీసుకు వచ్చి వివిధ అభివృద్ధి పనులకు కేటాయించామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నరసాపురం నియోజకవర్గానికి నిధుల మంజూరు, వివిధ దశల్లో పనులు, పనుల పూర్తి వంటి విషయాల్లో 85 శాతం మార్కులు సాధించామన్నారు. మిగిలిన 15 శాతం పనులను కూడా పూర్తిచేసి నూరుశాతం మార్కులు దక్కించుకోవడానికి అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పనులు పూర్తి చేయడంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాల పెద్దలు కూడా చొరవ చూపాలని కోరారు. తన పరిధిలో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించగలుగుతున్నానని, వాటిని సరైన సమయంలో సక్రమంగా వినియోగిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. గ్రామ సచివాలయ నిర్మాణానికి సంబంధించి న్యాయస్థానాల జోక్యంతో నిలిచిన పసలదీవి, రుస్తుంబాద, వేములదీవి తూర్పు గ్రామాలకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికలు తనకు సమర్పించాలని తహసీల్దార్ ఫాజిల్‌ను ఆదేశించారు. రుస్తుంబాద, నవరసపురం, వేములదీవి తదితర గ్రామాల్లో నిధులు కేటాయించినప్పటికీ పనులు ముందుకు సాగకపోవడానికి ఉన్న కారణాలను ఆయా ప్రాంతాలను ప్రజాప్రతినిధులు, అధికారులు బృందాలుగా సందర్శించి తనకు పూర్తి నివేదిక సమర్పించాలని, ఎంపీపీ మైలాబత్తు సోనీ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణలకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బుచ్చేశ్వరరావు, మండలంలో చేపట్టిన పనులను వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, లక్ష్మణేశ్వరం ఎంపీటీసీ సభ్యుడు కోలపర్తి రామకృష్ణ, మల్లవరం పెదలంక సర్పంచ్ గొట్టుముక్కల సుజాత తమ గ్రామాల్లో మంచినీటి కోసం ఎదుర్కొంటున్న సమస్యను సభ దృష్టికి తీసుకు వచ్చారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బుచ్చేశ్వరరావును ఎమ్మెల్యే ఆదేశించారు. చామకూరి పాలెం సర్పంచ్ బొక్కా రామస్వామి గ్రామంలోని విద్యుత్ సమస్యలను సభదృష్టికి తీసుకు రాగా తక్షణమే పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. తమ గ్రామ కార్యదర్శి ఫోన్ చేస్తే ఎత్తడంలేదని సభలో మల్లవరం లంక గ్రామ సర్పంచ్ సుజాత చెప్పారు. ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూడాలని ఎంపీడీఓ శివప్రసాద్‌యాదవ్‌కు ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో ఎంఈఓ పుష్పరాజ్యం, వ్యవసాయ శాఖ ఏఓ శామ్యూల్ జాన్సన్, ఏపీఎం పిప్పళ్ల పద్మ వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు దొంగ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత



కమ్యూనిటీహాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్య ఇచ్చి పని చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో రూ.14 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్ నిర్మాణానికి బుధవారం ముదునూరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతీ సచివాలయ పరిధిలోని ప్రాంతాలకు రూ.20 లక్షలు కేటాయించి అభివృద్ధి పనులు మొదలు పెట్టామన్నారు. నియోజకవర్గం మొత్తంగా రూ 13.80 కోట్లుతో ఈ పనులు జరుగుతున్నాయని చెప్పారు. గడపగడపకూ తిరిగినప్పుడు ప్రజల కోరిక మేరకు 21 గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలు మంజూరు చేసి కడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బర్రి శంకరం, పప్పుల రామారావు, వంగలపూడి జక్కరయ్య, గోరు సత్తిబాబు, తాడి భరత్, భారతి విజయరాజు, భూసరపు జయ, కావలి నాని, నిప్పులేటి సత్యనారాయణ, కొప్పినీడి శివాజీ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శనలు



అవార్డులు గెలుచుకున్న విద్యార్థులు

నరసాపురం: స్థానిక శ్రీ ఆదిపరాశక్తి నృత్యనికేతనం విద్యార్థులు తమిళనాడుతోని చిదంబరం, అరుణాచలం పుణ్య క్షేత్రాల్లో ప్రదర్శనలు ఇచ్చి అవార్డులు గెలుచుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వెళ్లి చిదంబరంలో కూచిపూడి ప్రదర్శనలు ఇవ్వడం ఇదే ప్రథమం. ఈ నెల 8న అరుణాచలంలో వాగ్దావీ వాద్యసంగీత నృత్య కళాశాల, రమణ మహర్షి నృత్య పుష్పాంజలి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో, ఈ నెల 9న చిదంబరంలో ప్రదోష వేళ చిత్రే మాసోత్సవాల సందర్భంగా నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఇందిరాశ్రీకృతి, కె.ప్రణవి, ఎస్ శ్రీనిధి, డి.సాక్షి, ఆర్ సాయి, వై.కపిల, వి.సిరి, వి.రత్న చిన్మయి. బి.రాధాదేవి, డి.ఫనిదుర్గ హాజరై నాట్యాచారిణి వి.లనంతలక్ష్మీదేవి పర్యవేక్షణలో ప్రదర్శనలు ఇచ్చారు. గురువులకు నాట్య ప్రజ్ఞ, చిన్నారులకు నాట్య ప్రవీణ అవార్డులు చిదంబరంలో అందజేసినట్టు అనంత లక్ష్మీదేవి చెప్పారు. అద్భుత ప్రదర్శనలతో అవార్డులు అందుకుని వచ్చిన అనంతలక్ష్మీదేవిని, ఆమె శిష్యులను ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, నత్యనికేతనం అధ్యక్షుడు కర్నల్ ఆర్‌కేవీ రావు, ఉపాధ్యక్షుడు ఆర్.సుబ్బారావు అభినందించారు.

చురుగ్గా ఉపాధి పనులు



నక్కావారిపాలెంలో పంటబోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. బుధవారం మొగల్తూరులోని నక్కావారిపాలెం, ఇంజేటి వారిపాలెం, పాలకమ్మచెరువు, కాళీపట్నం తూర్పు, పడమర గ్రామాల్లో పంటబోదె తవ్వకం పనులు చేపట్టారు. ప్రధాన కాలువలు వదిలేలోపు అన్ని గ్రామాల్లోని పంట బోదెల్లో పూడికపోయిన మట్టిని తవ్వి ప్రతి శివారు ప్రాంతానికి సాగు నీరందించేలా తవ్వకాలు చేపట్టామని ఏపీఓ వై.శ్రీనివాస్ తెలిపారు.

యాప్‌ను రద్దు చేయాలి

నరసాపురం రూరల్: ఉపాధి హామీ పథకంలో కూలీలలకు నష్టం కలిగించే యాప్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. బుధవారం వేములదీవి పడమర, ధర్భరేవు గ్రామాల్లో ఉపాధికూలీల పని ప్రదేశాల్లో ఆ సంఘ నాయకులు పర్యటించి కూలీల ఇబ్బందును గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంఘ మండల కార్యదర్శి గుబ్బల నాగేశ్వరరావు, మత్స్యకార్మిక సంఘం నాయకులు జెల్లి రామ్మోహనరావు తదవతరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సకాలంలో స్పందించాలి



లంకలకోడేరు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డా.మహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్య సిబ్బంది సకాలంలో స్పందించాలని జిల్లా వైద్యాధికారి డా. మహేశ్వరరావు కోరారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించి గర్భిణులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదకర లక్షణాలు ఉన్న గర్భిణులను సర్వే ద్వారా గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం వెంకటాపురంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించారు. ప్రజలకు ఆరోగ్య సేవలను అందించడంలో వైద్య బృందం అప్రమత్తంగా ఉండాలన్నారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేయాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డా. అద్దాల ప్రతాప్‌కుమార్, డా.నవ్యజీవన్, డా.భవానీ ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారులు గుడాల హరిబాబు, కె ప్రభాకరరావు, పీహెచ్ఎస్ పి.ఎలిజబెత్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'చదవడం మాకిష్టం'



పాలకొల్లులో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న సీఐ రాంబాబు

పాలకొల్లు సెంట్రల్: వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదువుకోవడం అలవాటు చేసుకోవాలని పట్టణ సిఐ దారావతు రాంబాబు సూచించారు. బుధవారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో చదవడం నాకిష్టం కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సిఐ రాంబాబు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తకపఠనం అలవాటు చేసుకోవడం వల్ల సొంతంగా కథలు రాయడం, చదవడం, బొమ్మలు గీయడం వంటివి అలవోకగా నేర్చుకోవచ్చన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారి ఉత్తర్వుల మేరకు పాఠశాలల్లో చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఒక్కో విద్యార్థికి నాలుగు చొప్పున గ్రంథాలయ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై ఎస్ ముత్యాలరావు, పిఎంసి చైర్మన్ కొత్తల వెంకటకుమారి, డాక్టర్ ఎస్వీ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ రావు జయంతి



పీవీ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుమ్మాపు

పాలకొల్లు సెంట్రల్: మాల, మాదిగలు అన్నదమ్ముల్లా జీవిస్తున్న సమయంలో తన ఓటు బ్యాంకు రాజకీయాలకోసం నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ చిచ్చు పెట్టారని పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్యవరప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద పీవీ రావు 74వ జయంతి కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పీవీ రావుల చిత్రపటానికి పూలమాలుల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుమ్మాపు వరప్రసాద్ మాట్లాడుతూ 1997లో హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద వర్గీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టామన్నారు. దళితుల అభివృద్ధి కోసం పీవీ రావు ఉన్నతమైన ఉద్యోగాన్ని వదిలి అంబేడ్కర్ ఆశయాల సాధన కోసమే పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పానుకు దైవకృప, బుంగా జయరాజు, చేరుగొండి పద్మకిషోర్, ఎల్లమెల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రాయకుదురులో ఆయుర్వేద వైద్య సేవలు

వీరవాసరం: ఆయుర్వేద వైద్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని రాయకుదురు సర్పంచ్ గడ్డం భారతి తెలిపారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్య శాఖ ఆధ్వర్యంలో రాయకుదురు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల బాగును చూస్తూ, ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తుందన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిత్యం కృషి చేస్తుందని వివరించారు. సుమారు 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యాధికారి టి.రామచందర్, ఎన్‌వీఎస్ మూర్తి, గ్రామ కార్యదర్శి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు



గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో విద్యార్థులు



పాలకొల్లులో విద్యార్థులతో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. తరువాత కథలు చెప్పడం, యోగా చేర్పించారు. ఈ సందర్భంగా నరసాపురం గ్రేడ్–1 గ్రంథాలయం లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి మాట్లాడుతూ వచ్చే నెల 11 వరకూ ఈ శిక్షణా కార్యక్రమం సాగుతుందని చెప్పారు. వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వరరావు, సుధీర్‌మోహన్, సూర్యంబాబు, భట్టిప్రోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: సమ్మర్ క్యాంపులో భాగంగా గ్రంథాలయంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. బుధవారం యోగా శిక్షకుడు కేవీవీసత్యనారాయణ విద్యార్థులకు తాడాసనం, వృక్షాసనం, పాదహస్తాసనం, గరుడాసనం వంటి ఆసనాలను నేర్పించారు. అనంతరం స్టోరీ టెల్లింగ్, జనరల్ నాలెడ్జ్ పోటీలు, క్యారమ్స్, చెస్ వంటి ఆటలను ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి వి.శాంతకుమారి, కె.సూర్యకుమార్, కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

17న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఆకివీడు: స్థానిక సంతనగర్ ఏరియాలో జై భీమ్ యూత్, స్థానిక పెద్దలు ఏర్పాటు చేసిన భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, విగ్రహాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జున ఈ నెల 17న ఆవిష్కరిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అంబటి రమేష్ కార్యక్రమ వివరాలను వెల్లడించారు.

కోరుకొల్లులో చోరీ

పాలకోడేరు: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బంగారం నగదు అపహరించకపోయారని గణేష్ మోహన్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోరుకొల్లు గ్రామానికి చెందిన గణేష్ మోహన్ సింగ్ దంపతులిద్దరూ బుధవారం ఇంటికి తాళం వేసి భీమవరం వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం బద్దలు కొట్టి తలుపులు తీసినట్లు గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువాలోని మూడు పేటలు బంగారం గొలుసు (సవరలు), చెవి దిద్దులు, రెండు బంగారు బిల్లలు, (రూపులు) గుర్తుతెలియని దండగలు దోచుకుపోయారు. మరొక అర ఓపెన్ కాకపోవడంతో అందులోను వస్తువులు అలానే ఉన్నాయి. కొంత నగదు మాత్రం అపహరించుకుపోయారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

వీరవాసరం: రైతులు వద్ద నుంచి ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్డీఓ దాసిరాజు తెలిపారు. వీరవాసరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. రైతులు ఎవ్వరూ అధైర్య పడవద్దని సూచించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ రైతు సమస్యల పట్ల తక్షణ స్పందించాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అడిగిన వెంటనే గోనె సంచులను ఏర్పాటు చేయాలని వివరించారు.సమావేశంలో తహసీల్దార్ ఎం.సుందర్ రాజు, మండల వ్యవసాయ అధికారి ఎస్.గీతాదేవి తదితరులు పాల్గొన్నారు

ప్రధాన డ్రెయిన్లను శుభ్రం చేయాలి



వార్డులో సమస్యలపై చర్చిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం: పట్టణంలోని అన్ని ప్రధాన డ్రెయిన్స్‌ను ఈ వేసవిలో శుభ్రం చేయాలని చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. పట్టణంలోని 23వ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. వార్డుల్లో డ్రెయిన్స్, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. వీధి లైట్లు ఎలా వెలుగుతున్నాయి, మంచినీటి సరఫరాలో ఏమైనా లోపాలు ఉన్నాయా? అన్న అంశాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ డ్రెయిన్స్‌ను శుభ్రం చేసి బయలకు తీసిన వ్యర్థాన్ని వెంటనే అక్కడ నుంచి తొలగించాలని చెప్పారు. లేదంటే పారిశుద్ధ్య ఇబ్బందులు ఏర్పడతాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, స్థానిక వార్డు కౌన్సిలర్ కావలి రామసీత, కావలి నాని పాల్గొన్నారు.

నేడు గ్రామ దేవతల తీర్థ మహోత్సవం

పెనుగొండ: పెనుగొండ గ్రామ దేవతలు కోట్లమ్మ, మారేమ్మలకు గురువారం తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. గ్రామ దేవతల జాతర మహోత్సవాలు సందర్భంగా మంగళవారం గ్రామ దేవతలకు నైవేధ్యాలు సమర్పించారు. గురువారం నాడు మారేమ్మ గూడెంలోని కోట్లమ్మ, మారేమ్మ ఆలయాల వద్ద తీర్థ మహోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి గ్రామ దేవతల దర్శనం అనంతరం, తీర్థం నిర్వహించనున్నారు.

పంట కోత ప్రయోగం



గోరింటాడలో పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని గోరింటాడలో పంట కోత ప్రయోగాన్ని అధికారులు బుధవారం నిర్వహించారు. మండెల కనకదుర్గాప్రసాద్ రైతుకి చెందిన 0.50సెంట్లు వ్యవసాయ భూమిలో ఈ పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఐదు మీటర్లు పొడవు, 5 మీటర్లు వెడల్పులో పంట కోసి తూకం వేయగా 19.100 గ్రాముల ధాన్యం దిగుబడి వచ్చింది. అంటే ఎకరానికి 40 బస్తాలు దిగుబడి వచ్చినట్లు అధికారులు నిర్ణయించారు. పాలకొల్లు మండలంలో 64 పంట కోత ప్రయోగాలు నిర్వహించాల్సి ఉండగా ఇప్పటివరకు 34 పంట కోత ప్రయోగాలు నిర్వహించమని ఏఎస్‌వో సుధాకర్ చెప్పారు. వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీం, వీఆర్వో చవ్వాకుల ఆదినారాయణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ సూర్య, వీఆర్ఏ మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

సాక్షి, భీమవరం: గతేడాది సెప్టెంబర్‌లో మోటార్ సైకిల్ అపహరించిన కేసులో ఆకివీడుకు చెందిన కె.ఏసు అనే వ్యక్తికి 9 నెలల జైలు శిక్ష విధిస్తూ భీమవరం 2వ ఏజేఎఫ్‌సీఎం న్యాయమూర్తి డి.ధనరాజు తీర్పు చెప్పారని టూటౌన్ పోలీసులు తెలిపారు. ఎస్సై అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. మరో కేసులో ఒక మహిళ నుంచి 2 కాసుల బంగారాన్ని అపహరించిన నేపథ్యంలో నర్సింహపురానికి చెందిన ఎం.వెంకన్న అనే వ్యక్తికి 6 నెలలు జైలు శిక్ష విధిస్తూ భీమవరం 2వ ఏజేఎఫ్‌సీఎం న్యాయమూర్తి డి.ధనరాజు తీర్పు చెప్పారని టూటౌన్ పోలీసులు తెలిపారు.